క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మొక్కలతో పాఠశాల విద్యార్థులు, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మునేష్ మీనా అన్నారు. శనివారం ఏక్ పేడ్ మా కే నామ్, ప్లాంట్ ఫర్ మదర్, ఎకో క్లబ్ ఫర్ మిషన్‌లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. అనంతరం మొక్కలను నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రిన్సిపాల్ మీనా విద్యార్థులకు వివరించారు. జీవ వైవిధ్యంతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం ఎంతో ముఖ్యమని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థులకు తిథి భోజనం



విద్యార్థులకు భోజనం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా కడప మండలం ఆలంఖాన్‌పల్లి జిల్లా పరిషత్తు పాఠశాలలో శనివారం తిథి భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మునిరత్నమ్మ తమ తమ్ముడు సురేష్ బాబు జ్ఞాపకార్థం ఆమె పిల్లలకు పండ్లను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం మునిరత్నమ్మ మొక్కలను నాటారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతోపాటు చెట్లను సంరక్షించాలన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చెన్నూరు బస్టాండ్ సమీపంలో మట్కా రాస్తున్న రవీంద్రనగర్‌కు చెందిన షేక్ ఫైరోజ్‌ను శనివారం మధ్యాహ్నం సీఐ సి. భాస్కర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. రూ. 5150 నగదును, రెండు మట్కా స్లిప్‌లు సీజ్ చేశారు.

పోటీల బ్రోచర్ల విడుదల



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప కల్చరల్ : స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న విద్యార్థులకు నిర్వహించనున్న వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల పోస్టర్లు, బ్రోచర్లను శనివారం జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి తన చాంబర్‌లో విడుదల చేశారు. బాలోత్సవ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలు విద్యార్థుల్లో దేశభక్తిని పెంచగలవని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. బాలలు చదువుతోపాటు సమాజం పట్ల బాధ్యతను కలిగి ఉండేలా ఆదర్శవంతమైన భావాలను వారిలో పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ్ అధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, కోశాధికారి సునీత, ఉపాధ్యక్షులు బాల యల్లారెడ్డి, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో పలు విభాగాల తనిఖీ



అతిథి గృహాన్ని పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలను వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. పలు విభాగాలకు వెళ్లి రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విశ్వవిద్యాలయ అతిథి గృహాల వార్డెన్‌లతో సమావేశమయ్యారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఏ చిన్న అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. నూతన విద్యార్థులను దృష్ట్యా వారి సౌకర్యాలపై చర్చించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ విభాగాన్ని చేశారు. గెస్ట్ హౌస్‌లో నిల్వ ఉన్న పాత వస్తువులలో చిన్నచిన్న మార్పులతో ఉపయోగపడే వాటిని ఉంచి మిగతా వాటిని తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో పబ్లిక్ రిలేషన్ సెల్‌తో సమీక్షించారు. పీఆర్ సెల్ సంచాలకులు డాక్టర్ ఎస్వీ సుబ్బారెడ్డి పలు అవసరాలను రిజిస్ట్రార్ దృష్టికి తెచ్చారు.

ఒలింపిక్స్‌లో భారత జెండా ఎగరాలి

భారతజట్టుకు శుభాకాంక్షలు తెలిపిన కోచ్‌లు, క్రీడాకారులు



భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతున్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : ప్యారిస్ ఒలింపిక్స్ ప్రారంభమైన నేపథ్యంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులందరూ చక్కటి ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించాలని క్రీడాకారులు, కోచ్‌లు ఆకాంక్షించారు. శనివారం కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానం ఆవరణంలో భారత జట్టుకు శుభాకాంక్షలు తెలిపే ఫ్రేమ్‌ను ఏర్పాటు చేసి క్రీడాకారులు విజయీభవ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి మాట్లాడుతూ ప్యారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి పతకాలను సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. చాలా విభాగాల్లో ఈ ఒలంపిక్స్‌లో భారత్‌కు పతకం ఖాయమని పేర్కొన్నారు. అనంతరం జయహో.. భారత్ అంటూ క్రీడాకారులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో కోచ్‌లు ఎన్.వి.పి.అమృత్‌రాజ్, సుదర్శన్‌సిద్ధిఖ్, అబ్దుల్ మునాఫ్, కల్యాణ్, నూర్, విలిం కేర్, జాకీర్, శ్యామ్యూల్, డీఎస్‌ఏ సిబ్బంది అక్బర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆల్ ది బెస్ట్ భారత్..



ప్యారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనతో పతకాలు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాం. చాలా క్రీడాంశాల్లో మనకు పతకాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. యావత్ భారత క్రీడాకారులు, క్రీడాభిమానులు భారత క్రీడాకారుల వెన్నంటే ఉన్నారు.

– కె. జగన్నాథరెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, కడప

పతకాల పంట పండిస్తారని భావిస్తున్నాం..



గత ఒలింపిక్స్ కంటే ఎక్కువ సంఖ్యలో పతకాల పంట పండిస్తారని ఆశిస్తున్నాం. చాలా క్రీడాంశాల్లో పతకాలు సాధించే సత్తా మన క్రీడాకారులకు ఉంది. ప్యారిస్ ఒలింపిక్స్‌లో మహిళా క్రీడాకారిణుల ప్రాతినిధ్యం పెరగడం సంతోషంగా ఉంది.

– ఆర్. రెడ్డిపద్మిణి, బ్యాడ్మింటన్ జాతీయ క్రీడాకారిణి, కడప

పతకాల వేట ఆరంభం..



ప్యారిస్ ఒలింపిక్స్‌తో పతకాల వేటకు భారత క్రీడాకారులు సన్నద్ధమయ్యారు. సాంకేతికంగా చాలా బలమైన జట్లు భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. బ్యాడ్మింటన్, రైఫిల్ షూటింగ్, బాక్సింగ్‌తో పాటు పలు క్రీడాంశాల్లో పతకాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆల్ ది బెస్ట్ భారత్.

– ఎస్. జిలానీబాషా, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ రెఫరీ, కడప

కాలుష్య నివారణకు పరిశోధనలు పెరగాలి



వర్చువల్‌గా పాల్గొన్న విదేశీ ప్రతినిధులు

వైవీయూ : కాలుష్య నివారణకు పరిశోధనలు పెరగాల్సిన అవసరం ఎంతో ఉందని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం కళాశాలలో జంతుశాస్త్రశాఖ ఆధ్వర్యంలో 'సుస్థిరాభివృద్ధిని సాధించడంలో పర్యావరణ సవాళ్లు' అన్న అంశంపై ఒక్కరోజు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం, తరుగుతున్న వనరులను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. వర్చువల్ విధానంలో పాల్గొన్న ఫిలిప్పీన్స్‌కు చెందిన మెరిచే మాట్లాడుతూ పెరుగుతున్న సముద్ర ఆమ్లీకరణను తగ్గించడంలో సీ గ్యాస్ లేదా సముద్ర గడ్డి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈసీఓఆర్ డైరెక్టర్ జిష్ణు మాట్లాడుతూ పెరుగుతున్న పర్యావరణ కాలుష్యం ద్వారా మానవ ఆరోగ్యం ఏ విధంగా ప్రభావితం చేయబడుతుంది.. వీటికి అవసరమైన ప్రత్యామ్నాయ విధి విధానాల ద్వారా సుస్థిర అభివృద్ధిని ఏ విధంగా సాధించవచ్చో వివరించారు. కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. పి. రవిశేఖర్, అకడమిక్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రామచంద్ర, అధ్యాపకులు నాగేంద్రకుమార్, మహేష్, అపర్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశైలం నుంచి కేసీకి, తెలుగుగంగకు నీరివ్వాలి

కడప కార్పొరేషన్ : శ్రీశైలం జలాశయం నుంచి కేసీ కెనాల్, తెలుగుగంగ జలాశయాలకు నీటిని విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ నేత, ఆర్టీసీ మాజీ జోనల్ ఛైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. శనివారం వారు జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 864 అడుగుల నీటి మట్టం ఉందని, శ్రీశైలం నుంచి కేసీ కెనాల్‌తోపాటు తెలుగుగంగలో అంతర్భాగమైన సబ్సిడరీ రిజర్వాయర్-1,2లతోపాటు బ్రహ్మంసాగర్ జలాశయాలకు నీరు ఇచ్చేందుకు వీలుగా పూర్తి స్థాయి డెడ్ స్టోరేజీలో ఉన్న వెలుగోడు జలాశయాన్ని నింపాలని కోరారు. శ్రీశైలం జలాశయంలో 841 అడుగులకు నీరు చేరాక పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కేసీ కెనాల్‌తోపాటు వెలుగోడు జలాశయానికి నీరు ఇచ్చే వెసులుబాటు ఉందన్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు దాదాపు 57వేల క్యూసెక్కుల నీరు వదులుతున్న నేపథ్యంలో కరువుకు కాణాచి అయిన రాయలసీమకు చెందిన కేసీ కెనాల్, తెలుగుగంగ జలాశయాలకు నీరు ఇచ్చే వెలుగోడు రిజర్వాయర్‌కు నీరు ఇవ్వకపోవడం అత్యంత బాధాకరం, దురదృష్టకరమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పై ప్రాంతంలో వాన వచ్చినా, వరద వచ్చినా నీరంతా శ్రీశైలంలోకి చేరుతాయని, తద్వారా జలాశయం పూర్తిస్థాయిలో నిండటం ఖాయమన్నారు. ఈ నేపథ్యంలో వెలుగోడు జలాశయంను వెంటనే నింపేందుకు ప్రభుత్వంతో, ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి కేసీ కెనాల్, తెలుగుగంగ రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

వరిలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి



రైతులతో కలిసి వరిపంటను పరిశీలిస్తున్న కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్ రెడ్డి

కడప అగ్రికల్చర్ : వరిపంటను సాగు చేసే రైతులు ఖచ్చితంగా కాలిబాటలను ఏర్పాటు చేసుకోవాలని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్ రెడ్డి సూచించారు. శనివారం కడప మండల పరిధిలోని పాతకడప, నానపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరిపంటను మండల విస్తరణాధికారులు పావని, మెహరాన్‌లతో కలిసి ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో కాలిబాటలు ఏర్పాటు చేసే రైతులు తూర్పు, పడమర దిశగా ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాటను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కాలిబాటలు ఏర్పాటు చేయడం వల్ల గాలి, వెలుతురు బాగా మొక్కకు అంది చీడపీడలు రాకుండా ఉంటాయన్నారు. అలాగే పురుగు మందుల పిచికారి, ఎరువులు వేసుకునేందుకు సులభంగా ఉంటుందన్నారు. వరి నాటే రైతులు నారుమడి నుంచే కొనలు తుంచి నాటుకోవాలన్నారు.

కౌలు కార్డులు పొందాలి..

కౌలుకు పంటలను సాగు చేసుకునే కౌలు దారులు గ్రామ రెవిన్యూ అధికారులను సంప్రదించి కార్డులను పొందాలని సూచించారు. ఈ సాగు దారులు హక్కు పత్రాలను 11 నెలల కాల పరిమితి కలిగి ఉంటారని పంట మీద మాత్రమే కౌలుదారుడికి హక్కు ఉంటుందన్నారు. భూమి మీద ఎటువంటి హక్కు ఉండదన్నారు. భూ యజమాని అనుమతితోనే కౌలు కార్డులు మంజూరు చేయబడుతుందని ఏవో సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

శ్రమదానం



శ్రమదానం చేస్తున్న వలంటీర్లు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం యూనిట్- 9 ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ విభాగ వాలంటీర్లు సేవా కార్యక్రమం నిర్వహించారు. గురుకులం వాణిజ్య విభాగం నుంచి విశ్వవిద్యాలయ ప్రధాన ద్వారం వరకు కంపచెట్లు, పిచ్చి మొక్కలు తొలగించి, ప్రధాన రహదారి గుంతలను మట్టితో పూడ్చారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డా.పి. క్రిష్ణయ్య, బి. సునీల్ కుమార్ పాల్గొన్నారు.

శిక్షణ అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలి



సన్మానం పొందిన రీసోర్సు పర్సన్‌లతో టీచ్ టూల్ జిల్లా కో ఆర్డినేటర్ చల్లా విశ్వనాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : టీచ్ టూల్ శిక్షణలో నేర్చుకున్న అంశాలను హెచ్‌ఎంలతోపాటు ఉపాధ్యాయులు తమ పాఠశాలలో అమలు పరిచి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని టీచ్ టూల్ జిల్లా కోఆర్డినేటర్ చల్లా విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. కడపలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో తొమ్మిది రోజుల నుండి నిర్వహిస్తున్న టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో కోఆర్డినేటర్ చల్లా విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలు, సీఆర్‌పీలు బోధనా నైపుణ్యాలను పెంపొందించుకొనేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. ఈ శిక్షణలో బోధనా అభ్యసన ప్రక్రియకు టెక్నాలజీ విధానాన్ని అనుసంధానాన్ని చేశామన్నారు. రిసోర్స్ పర్సన్లు గాయత్రీ బాయ్, ఉమామహేశ్వరి, నాగమణి కుమారి, మునీంద్రమ్మ, రాజేశ్వరి శిక్షణలో ఆసక్తికరమైన బోధనా అభ్యసన ప్రక్రియ విధానాలను వివరించడం జరిగిందన్నారు. అనంతరం డిస్టిక్ అబ్జర్వర్ సాయిరాం, కోఆర్డినేటర్ విశ్వనాథరెడ్డిలు రిసోర్స్ పర్సన్‌లను ఘనంగా సన్మానించారు.

రహదారంతా మురుగునీరే



బస్టాండ్‌లోకి వెళ్లే ప్రధాన రహదారిలో నిలిచిన మురుగునీరు

కడప ఎడ్యుకేషన్ : కడప అంబేద్కర్ సర్కిల్‌లోని ప్రధాన రహదారి నుంచి ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లే ప్రధాన రహదారిలోకి మురుగునీరు చేరి కంపు కొడుతోంది. కడప బస్టాండ్ నుంచి బుగ్గవంకలోకి వర్షం నీరు, మురిగునీరు వెళ్లేందుకు డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్టాండ్ సమీపంలో ఉన్న మురుగు కాలువ నీరంతా బస్టాండ్ సమీపంలోని మురుగు కాలువ నుంచి బయటకు వచ్చి బస్టాండ్‌కు వెళ్లే రహదారిలో నిలిచింది. దీంతో జనాలు, ప్రయాణికులు, ఆటోవాలాలు బస్టాండ్‌లోకి వెళ్లాలంటే వీలు లేకుండా పోయింది. దీనికి తోడు మురుగు కాలువలో నీరు కాబట్టి దుర్గంధం వెదజల్లుతోంది. గతంలో ఇలా నిల్వ ఉన్న మురుగునీటిని కార్పొరేషన్ సిబ్బంది మోటారు సహాయంతో వాహనంలోకి పంపు చేసి ఆ మురుగునీటిని తొలగించేవారు. కానీ ఈ పనిని గత నాలుగు రోజుల నుంచి చేయడం లేదని స్థానికులు తెలిపారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు, ప్రయాణీకులు కోరుతున్నారు.



ఎక్కువ రోజులు నీరు నిలవడంతో పాచి పట్టిన రోడ్డు



వాహనాల పార్కింగ్ ప్రదేశంలో కూడా నిలిచిన మురుగునీరు

సమాజ నిర్మాణంలో శాస్త్రవేత్తల పాత్ర ప్రశంసనీయం



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు పి.వెంకటేశ్వర్లు

కడప కల్చరల్ : సమాజ నిర్మాణంలో శాస్త్రవేత్తల పాత్ర ప్రశంసనీయమైనదని జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు పి.వెంకటేశ్వర్లు అన్నారు. శాస్త్రవేత్త జాన్ డాల్టన్ వర్ధంతి సందర్భంగా శనివారం కడప నగరం గుడ్‌మ్యానర్స్ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాస్త్రవేత్తల కృషి గొప్పదని, సమాజ పురోభివృద్ధికి మానవాళి ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాస్త్రవేత్తలు పరిష్కారాలు చూపారన్నారు. అలాంటి వారిలో డాల్టన్ ఒకరని, పదార్థ నిక్షిప్త సూత్రాన్ని ఆయన ప్రతిపాదించారని తెలిపారు. జేవీవీ నాయకులు ఎస్.సునీత, వై.అరుణ, పి.కుమారస్వామిరెడ్డిలు మాట్లాడుతూ ద్రవ్యం పరమాణువులు, రసాయనిక చర్యలపై అనేక పరిశోధనలు చేసి ఆధునిక పరమాణు సిద్ధాంతానికి డాల్టన్ పునాదులు వేశారన్నారు. అణుశక్తి వినియోగానికి ఆయన సిద్ధాంతమే బాటలు పరిచిందని తెలిపారు. వాతావరణ శాస్త్రం, వర్ణ అంధత్వంపైనే కాకుండా చంద్రుని గురించి పరిశోధనలు చేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ షకూర్, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ రాముడు

కమలాపురం : పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. నగర కమిషనర్ రాముడు క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్లపై చెత్తా చెదారం ఊడ్పించడం, అలాగే డ్రైనేజ్‌లో నిల్వ ఉన్న పూడికను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే కొత్తపల్లిలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాముడు మాట్లాడుతూ దుకాణాదారులు, ప్రజలు పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి దుకాణాదారుడు డస్ట్‌బిన్‌లను పెట్టుకుని చెత్తను అందులో వేస్తే పారిశుద్ధ్య కార్మికులు వచ్చి వాటిని తీసుకెళ్తారన్నారు. రోడ్లు, కాలువలు పరిశుభ్రత పాటించడంలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నా రు. అలాగే ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించడానికే ట్యాంకులు శుభ్రం చేస్తున్నామన్నారు. కా ర్యక్రమంలో మేస్త్రీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను పెంచడం సామాజిక బాధ్యత



మొక్కలు నాటుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

కమలాపురం : మొక్కలను పెంచడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని జడ్పీ బాయ్స్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం అర్షియాబేగం తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన శిక్షా సప్తాహ్‌లో భాగంగా శనివారం ఆమె పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులతో 50 మొక్కలను నాటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూతాపం తగ్గాలన్నా, జీవుల మనుగడ కనుమరుగు కాకుండా ఉండాలన్నా ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచడం అలవా టుగా చేసుకోవాలన్నారు. మొక్కలు నాటడం వలన వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. తద్వారా పంటలు బాగా పండించవచ్చన్నారు. మొక్కలు అందించిన ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధులకు, గుంతలు తీయించిన దాత ఖాదర్‌బాషాకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ జిల్లా జాయింట్ ట్రస్టీ కాలువ చలపతి, విద్యా వాహిని కోఆర్డినేటర్స్ సుదర్శన్, వీరనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో మౌఖిక పరీక్షతో పాటు డెమో నిర్వహించి త్రిసభ్య కమిటీ ద్వారా నియామకాలు జరుగుతాయన్నారు. కామర్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ సబ్జెక్టులను బోధించేందుకు నెట్, సెట్, పీ హెచ్‌డీ, బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధా న్యత ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు కళాశాల ఆఫీ సులో సంప్రదించాలన్నారు.

ప్రజలపై పన్నుల భారం వద్దు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప నగర వాసులకు పన్నుల భారం లేకుండా చూడాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ.బాదుల్లా ధ్వజమెత్తారు. నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం చెత్త పన్ను భారం ఉండదని చెప్పగా.. కడప నగరపాలక సంస్థ అధికారులు ఇంటి పన్ను పెంచడమేమిటని ఆయన ప్రశ్నించారు. 2021 సంవత్సరం నుంచి 30 వేల ఇళ్లకు రివైజ్డ్, ఇంప్రూమెంట్ పన్ను పేరిట రూ.15 కోట్ల భారం వేసే ప్రయత్నాలు మానుకోవాలని మునిసిపల్ కమిషనర్‌కు హితవు పలికారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి దృష్టి సారించి పన్నుల భారం తగ్గించేలా చూడాలన్నారు. 2021 సంవత్సరం నుంచి ఇంటి ప్లాన్ తీసుకొని నిబంధనలు పాటించని, అదనపు నిర్మాణాలు చేపట్టిన ఇళ్లకు ఐదు రెట్లు పన్ను పెంచడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో యస్.హుస్సేన్ పాల్గొన్నారు.

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్ : అల్పపీడనం కారణంగా శనివారం తెల్లవారుజామున జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. పులివెందుల్లో 8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వీఎన్ పల్లిలో 7.6, సీకేదిన్నెలో 7.2, సిద్దవటంలో 5.4, ఒంటిమిట్టలో 5.2, పొద్దుటూరులో 4.6, పెండ్లిమర్రిలో 4.4, కడపలో 3.6, చాపాడులో 2.8, కొండాపురంలో 2.2, వేములలో 2, బద్వేల్‌లో 1.4, మైదుకూరులో 1, సింహాద్రిపురంలో 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పోరాటాలకు సిద్ధం కండి



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : పేదల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిర్లక్ష్యంపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సీపీఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన మహాధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రశ్నించకపోతే ప్రభుత్వాలు పేదల కోసం పనిచేయవని, గడిచిన 70 సంవత్సరాలుగా ప్రభుత్వాలు మారుతున్నా పేదల జీవితాల్లో మార్పు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే నియోజకవర్గంలో జరిగిన భూకబ్జాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బద్వేలు మండలం సి.కొత్తపల్లె రెవెన్యూ పొలం, అట్లూరు మండలం నల్లాయపల్లె గ్రామపొలంలలో జరిగిన ప్రభుత్వ భూముల కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. అలాగే సి.కొత్తపల్లె పొలంలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. తెలుగుదేశం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రతి నియోజకవర్గంలో నిర్వహించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామ్మోహన్, రూరల్ కమిటీ కార్యదర్శి వెంకటేష్, నాయకులు వెంకటరమణ, చాంద్‌బాషా, రామ్మోహన్ పాల్గొన్నారు.

గోవులను రక్షించిన మానవత స్వచ్ఛంద సంస్థ

వేంపల్లె : స్థానిక పురవీధుల్లో అనారోగ్యంతో బాధపడుతున్న గోవులను వేంపల్లెకు చెందిన గో సంరక్షణ సేవా సమితి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వైద్యం చేసి రక్షించారు. శనివారం పశువైద్యాధికారి డాక్టర్ సాధిక్‌బాషా, రిటైర్డ్ వెటర్నరీ ఆఫీసర్ రాజారామ్‌లతో తగిన వైద్యం అందించారని ఆ సంస్థల కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక ఆవు గర్భసంచి సమస్యతో అనారోగ్యపాలై చాలా బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఓ మహిళా రైతు డాక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో వైద్యం చేసి ఆ గోవును రక్షించినట్లు ఆయన తెలిపారు. మానవత శాశ్విత ఛైర్మన్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో సంచరిస్తున్న గోవులను తమ యజమానులు సంరక్షించుకోవాలని తెలిపారు. అలాగే ఎక్కడైనా అనారోగ్యంతో బాధపడుతున్న ఆవులను చూస్తే వెంటనే గో రక్షణ సేవా సమితి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సభ్యులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో గో సంరక్షణ సమితి సభ్యులు, గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం ఛైర్మన్ కావలి కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.